క్లుప్తంగా

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు



ప్రధాన వీధుల్లో సంచరిస్తున్న పశువులను లారీలో ఆదోని గోశాలకు తరలిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ప్రజలకు ఇబ్బంది కలిగించేలా పశువులను రోడ్లపైకి వదిలితే వాటి యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతూ గాయాలపాలు చేస్తున్న పశువులను ఆదోని గోశాలకు తరలింపు ప్రక్రియను మున్సిపల్ అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పట్టణంలో సంచరించే పశువుల్లో కొన్నింటిని మున్సిపల్ సిబ్బంది పట్టుకొని లారీలో ఆదోని గోషాలకు తరలించారు. ప్రధాన రహదారులపై సంచరిస్తూ ప్రజలను ప్రమాదాలకు గురిచేయడమే కాకుండా ఒకరి మృతికి పశువులు కారణం కావడంతో ప్రజలు, కౌన్సిలర్ల నుంచి అనేక ఫిర్యాదులొచ్చాయి. దీంతో స్పందించిన మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పశువులను పట్టుకొని ఆదోనిలోని గోశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా పశువులను పట్టణంలో రోడ్లపైకి వదిలితే వాటి యజమానులపై కేసులు నమోదు చేయించడమే కాకుండా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు

గోనెగండ్ల: మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎమ్మిగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఖాద్రీ, ఏఓ హేమలత తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. రైతులకు కావాల్సిన ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వేముగోడులో 8.5 టన్నుల ఎరువులు, బి.అగ్రహారంలో 14 టన్నులు, బైలుప్పలలో 13.5 టన్నులు, గంజిహళ్లిలో 19.5 టన్నులు, కైరవాడిలో 9 టన్నులు, నెరుడుప్పలలో 6.5 టన్నులు, పుట్టపాశంలో 10 టన్నులు, తిప్పనూరులో 17 టన్నులు, పెద్దమరివీడులో 18 టన్నులు చొప్పున రైతు భరోసా కేంద్రాల్లో ఉన్నాయని, కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సిబ్బందిని సంప్రదించి పొందవచ్చన్నారు.

హొళగుంద ఎంపీడీఓగా సుభాషిణమ్మ

హొళగుంద: హొళగుంద మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి (ఎంపీడీఓ)గా సుభాషిణమ్మను నియమించినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. సత్యసాయి జిల్లాకు చెందిన ఈమె ఈఓపీఆర్డీగా పని చేసి పదోన్నతిపై హొళగుందకు బదిలీ అయినట్లు తెలిసింది. ఇప్పటివరకు ఆస్పరి ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న రాధ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటేషన్‌పై హొళగుంద ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వర్తించారు. నూతన ఎంపీడీఓ సుభాషిణమ్మ త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

ఉచితంగా గణనాథుని ప్రతిమలు

హొళగుంద: ఈ నెల 18న వినాయక పండుగను పురస్కరించుకుని భక్తులకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేయనున్నట్లు హొళగుంద సాయిబాబా మందిరం పూజారి శ్రీకాంత్ బుధవారం తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా భక్తులకు మట్టి వినాయక విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేసేందుకు సంకల్పించినట్లు వెల్లడించారు. భక్తులు హొళగుంద సాయిబాబా ఆలయం పక్కనున్న సాయితేజ వాటర్ ప్లాంట్‌లో సంప్రదించి మట్టి వినాయక విగ్రహాలను తీసుకెళ్లవచ్చన్నారు. వివరాలకు 95025 70229 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

కృష్ణగిరి: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్ఐ సురేష్ హెచ్చరించారు. బుధవారం ఆయన ఎరుకల చెర్వు క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆటో, ద్విచక్ర వాహనాదారులకు రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వాహనం నడిపే వ్యక్తి మద్యం తాగితే జరిగే అనర్థాల గురించి ప్రయాణికులకు తెలయజేశారు. మద్యం తాగి వాహనం నడిపే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వాహనాలకు సంబంధించి చలానా పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

పత్తికొండ రూరల్: స్థానిక కటిక వీధిలో నివాసం ఉంటున్న మంగలి నరేష్ (38) అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నరేష్ కోలుకోలేక బుధవారం ఇంట్లోనే కన్ను మూశాడు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కూతురు ఇంద్రజ ఉన్నారు. దహన సంస్కారాల నిమిత్తం మృతుడి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర రెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

నిర్లక్ష్యపు క్రీడ.. భవనానికి చీడ

- అధికారుల నిర్లక్ష్యంతో మందుబాబులకు అడ్డాగా మారిన క్రీడాభవనం
- మెయిన్ డోర్లు, కిటికీలు, అద్దాలు ధ్వంసం చేసిన ఆకతాయిలు

పత్తికొండ రూరల్: సుమారు రూ.కోటిరన్నర వెచ్చించి నిర్మించిన భవనాల నిర్వహణ అధ్వానంగా మారడంతో లక్ష్యం వెక్కిరిస్తోంది. సంబంధిత అధికారుల బాధ్యతా రాహిత్యంతో క్రీడాకారుల కోసం కోట్లు వెచ్చించినా వాటి ప్రయోజనం అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. ఇటు ప్రజాధనం దుర్వినియోగమవుతుంది. పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఇండోర్ స్టేడియం, దీనికి అనుబంధంగా క్రీడా వసతి భవనం, రోడ్డు వైపు 6 గదులను నిర్మించారు. ఇన్ని నిధులు వెచ్చించి నిర్మించిన ఇండోర్ స్టేడియంలో షటిల్ కోర్టుకు 25 మంది, జిమ్‌కు 9 మంది మాత్రమే వస్తున్నారు. వీరి నుంచి ప్రతినెలా వసూలు చేసిన ఫీజు, గదుల అద్దె సొమ్ము రూ.16 వేలు కలెక్టర్ పేరుతో జమ చేస్తున్నారు.

క్రీడా భవనం.. నిర్వహణ అధ్వానం

ఈ ప్రాంతంలో జరిగే టోర్నమెంట్లకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారుల వసతి కోసం భవనం నిర్మించారు. భవనంలోని ప్రత్యేక గదులు, టాయిలెట్స్ నిర్వహణ గురించి పట్టించుకునే నాథుడే లేకపోవడంతో అధ్వానంగా మారింది. దీంతో వసతి భవనం మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. తాగిన మత్తులో మందుబాబుల వీరంగంతో డోర్ల అద్దాలు, కిటికీలు, స్విచ్ బోర్డులు ధ్వంసమైపోయాయి. భవనం అంతా ప్లాస్టిక్ కవర్లు, మందుబాటిళ్లు, చెత్తాచెదారంతో నిండిపోయింది.

8 నెలలుగా సిబ్బందికి అందని వేతనాలు

క్రీడాకారుల వసతి భవనం నిర్వహణ బాధ్యతను చూసుకుంటున్న స్టేడియం కోచ్, వాచ్‌మన్, స్వీపర్‌లకు సెట్కూరు నుంచే జీతభత్యాలు చెల్లించేవారు. అయితే ప్రస్తుతం 8 నెలల నుంచి వీరికి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. నిర్వహణపై అధికారులు దృష్టి కేంద్రీకరించాలని క్రీడాకారులు కోరుతున్నారు.




పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలోని క్రీడాకారుల వసతి భవనం



చెత్తాచెదారంలో నిండిన భవనం



ధ్వంసమైన కిటికీ అద్దాలు





స్విచ్ బోర్డును ధ్వంసం చేసిన దృశ్యం, మందుబాబులు తాగి పడేసిన మద్యం బాటిళ్లు, గ్లాసులు, కవర్లు

నేడు గీతామందిరంలో కృష్ణాష్టమి వేడుకలు

ఎమ్మిగనూరు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం గీతా మందిరంలో నిర్వహించనున్నట్లు గీతా జ్ఞాన సేవామందిర్ నిర్వాహకులు నాగరాజు, ఉరుకుంద, హంపయ్య పేర్కొన్నారు. గురువారం ఉదయం 6 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ చేపడుతారు. 8 గంటలకు గోపూజ, 9 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు. 9.30 నుంచి 10.30 గంటల వరకూ గీతా హోమం, 11 గంటలకు భగవాన్ కృష్ణాపరమాత్మరథోత్సవం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు అన్నదాన కార్యక్రమం చేపడుతారు. సాయంత్రం 6 గంటలకు నాగరాజ ఆచారిచే ఉపన్యాసకార్యక్రమంఉంటుందని తెలిపారు.

వెల్దుర్తి: మండల కేంద్రంలోని పశువుల దేవాలయం ఆవరణలో శ్రీరుక్మిణి కృష్ణ గుడిలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ జయంతోత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. తెల్లవారుజాము అభిషేకం అనంతరం గోపూజ, మంగళహారతి, 11 గంటల నుంచి పట్టణ పురవీధుల గుండా స్వామివారి ఉత్సవ మూర్తులకు ఊరేగింపు, 1 గంటకు ఉట్టి కొట్టడం, రాత్రి భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే పుల్లగుమ్మి శ్రీకృష్ణుడి ఆలయంలో ఉట్టి కొట్టే కార్యక్రమం, గ్రామోత్సవం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మద్దికెర: మొక్కలను నాటి సంరక్షించాలని ఏపీఓ నర్సిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మద్దమ్మ చెరువు గట్టు మీద మొక్కలు నాటడాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటి వాటికి సకాలంలో నీటిని అందించడం వల్ల చెట్లు అయ్యి నీడను ఇస్తాయన్నారు. ప్రభుత్వం నిర్వహణ ఖర్చులు అందిస్తుందన్నారు. నిర్లక్ష్యం చేస్తే బిల్లులు మంజూరు కావన్నారు.

సభ్యుల సహకారంతోనే లాభాల బాట



టౌన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ యూకే రాజశేఖర్

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సూచనలు, సభ్యుల సహకారంతో టౌన్‌బ్యాంక్ లాభాల బాటలో పయనించేలా కృషి చేస్తున్నామని స్థానిక బ్యాంక్ నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్ యూకే రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ ఆవరణలో బుధవారం 78వ సర్వసభ్య సమావేశం జరిగింది. పాలకవర్గ సభ్యుల జ్యోతి ప్రజ్వలన అనంతరం బ్యాంక్ చైర్మన్ నివేదిక చదివి మాట్లాడారు. ఈ ఏడాది మార్చి 31 వరకు బ్యాంకుకు నికరలాభం రూ.42.75 లక్షలు వచ్చిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.3,64,65,000 మేర ఆదాయం సమకూర్చేలా అంచనాలు రూపొందించుకుని పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ చెల్లింపులు, చెల్లించిన వడ్డీ, ఖర్చులు, సిబ్బంది జీతభత్యాలు, వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనా, ఆదాయం తదితర వాటితో అజెండాలోని అంశాలపై బ్యాంక్ సీఈఓ వివరించగా పాలక వర్గం, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైడబ్ల్యూసీఎస్ చైర్మన్ బండా నాగరాజు, కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్ అహ్మద్, పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, కౌన్సిలర్లు ఖాశీంబేగ్, అమాన్, బ్యాంక్ డైరెక్టర్లు తట్టి బుడ్డప్ప, సయ్యద్ చాంద్, మహనందయ్య శెట్టి, టౌన్ బ్యాంక్ సీఈఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

హాలహర్వి: మండలంలోని గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిసరాలు శుభ్రంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఆంతోని పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని గూళ్యం గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మన్నతో కలిసి పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షాల వల్ల పారిశుద్ధ్యం లోపించి, తాగునీరు కలుషితమై ఉండొచ్చని చెప్పారు. అతిసార వ్యాధితో ప్రజలకు విరేచనాలు ఏర్పడడం జరిగిందన్నారు. వెంటనే పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడి వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్యసేవలు అందించినట్లు వివరించారు. అతిసారా వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చిందని, గ్రామంలో అతిసారా కేసులు జీరో అయ్యాయని చెప్పారు. ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. సమస్యలు ఉంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంపీడీఓ వెంట సర్పంచ్ ఉలిగమ్మ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వర్షం వచ్చె.. ఉత్సాహం తెచ్చె

నందవరం: మండలంలో గత రెండు రోజులుగా కురిసిన వానలకు పంట పొలాలు కళ సంతరించుకున్నాయి. వ్యవసాయ పనుల్లో రైతులు, రైతు కూలీలు నిమగ్నం కావడంతో సందడి నెలకొంది. పొలాల్లో ఎరువులు చల్లుకోవడం, మందుల పిచికారీ, మిరప నాట్లతో రైతన్నలు బిజీగా మారారు. దాదాపుగా నెల రోజులుగా వరుణడు మొహం చాటేయడంతో రైతులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా కురిసిన మోస్తారు వానలతో రైతన్నలకు ఊరట లభించింది. మండలంలోని నాగలదిన్నె, కనకవీడు, కే.పేట, నందవరం గ్రామాల్లో మెట్ట భూముల్లో మిరప నాట్లు జోరుగా సాగుతున్నాయి. పంటపొలాల్లో రైతులు, కూలీల సవ్వడి సాగుతోంది.



నాగలదిన్నెలో మిరప నారు నాటుతున్న కూలీలు



కే.పేటలో ఎరువు కలుపుకుంటున్న రైతన్నలు



కనకవీడులో మిరపనారను సిద్ధం చేస్తున్న దృశ్యం

ఆస్తి వ్యవహారంలో మహిళ ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట లక్ష్మి

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం గొల్లమానుపల్లిలో బుధవారం దారుణం చోటు చేసుకుంది. ఆస్తి తగాదాలో అక్క వెంకట లక్ష్మిని తమ్ముడు రంగారెడ్డి గ్రామస్తుల ముందే కాళ్లతో ఇష్టానుసారంగా తన్నాడు. దీంతో మనస్తాపం చెందిన అక్క పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు, బంధువులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గొల్లమానుపల్లికి చెందిన వెంకట లక్ష్మి, రంగారెడ్డి అక్కా తమ్ముడు. వీరి మధ్య కొంతకాలంగా ఆస్తి తగాదా కొనసాగుతోంది. ఈ క్రమంలో బుధవారం రంగారెడ్డి అక్క వెంకట లక్ష్మి ఇంటికెళ్లి ఆస్తి విషయంలో గొడవ పెట్టుకున్నాడు. అంతటితో ఆగకుండా అందరూ చూస్తుండగానే కింద పడేసి ఇష్టానుసారంగా కొట్టాడు. స్థానికులు సర్దిజెప్పినా వినలేదు. దీంతో మనస్తాపం చెందిన వెంకట లక్ష్మి పురుగు మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై జొన్నగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

కౌలు రైతు ఆత్మహత్య



మృతుడు బోయ నరసప్ప (ఫైల్)

దేవనకొండ: మండలకేంద్రానికి చెందిన కౌలు రైతు బోయ నరసప్ప (42) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. బోయ నరసప్ప గత ఆరేళ్ల నుంచి తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు మరో మూడు ఎకరాలను కౌలుకు తీసుకుని ఉల్లి, పత్తి, మిరప మొదలైన పంటలను సాగుచేస్తూ జీవనం సాగించేవాడు. ప్రతి సంవత్సరం అతివృష్టి లేదా అనావృష్టి వల్ల పంటలు నష్టపోయి పెట్టిన పెట్టుబడి కూడా చేతికిరాక దాదాపు రూ.6 లక్షల దాకా అప్పుల పాలయ్యాడు. అప్పు ఇచ్చిన వారు తిరిగి చెల్లించాలని తీవ్ర ఒత్తిడి చేయగా మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడినుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం తెల్లవారజామున 5.02 గంటలకు నరసప్ప మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మిదేవి, ఇద్దరు కుమార్తెలు నరసమ్మ, ఇందు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

మద్దికెర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం కొనసాగుతోందని, దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం మద్దికెరలోని జగనన్న కాలనీల్లో జేజేఎం నిధులు రూ.50 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి, అలాగే ఎన్నో ఏళ్లుగా ఇంటి పట్టాలకు నోచుకోకుండా ఉన్న స్థలంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేసేందుకు, ఇంటి నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగనన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారన్నారు. సొంతిల్లు లేని నిరుపేదలు ఉండరాదనే ఉద్దేశంతో జగనన్న కాలనీలు ఏర్పాటు చేయడమే గాకుండా నీటి వసతి, విద్యుత్, ఇంటింటికీ కొళాయి సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచ్‌లు సుహాసిని, విజయుడు, సలహాదారు ఆంజనేయులు, ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డు చైర్మన్ పక్కిరప్ప, సొసైటీ అధ్యక్షుడు శాంతన్న, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు పునరుద్ధరించాలి: గతంలో మాదిరిగా మద్దికెర నుంచి హైదరాబాద్‌కు బస్సు నడపాలని గ్రామస్తులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కరోనా సమయంలో బస్సు రద్దు చేశారని దీంతో వ్యాపారం, ఉద్యోగం, ఉన్నత చదువుల నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పంటల సాగు విధానాలపై పరిశీలన

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో రైతు మల్లికార్జున పొలంలో సాగుచేసిన ఏటీఎం మోడల్ పంటలను డీపీఎం చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, కన్సల్టెంట్ లక్ష్మయ్య, ఎన్ఎఫ్ఏ బుజేశ్వర్, పీపీటీ స్వాతి పరిశీలించారు. గ్రామంలో పర్యటించి పంటలను పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏటీఎం మోడల్‌ను వేసుకోవడం వల్ల ముల్లంగి 30 రోజుల్లో, బీట్‌రూట్ 60 రోజుల్లో, 90 రోజుల్లో క్యారెట్ దిగుబడులు చేతికి వస్తాయన్నారు. అదేవిధంగా ప్రతి సన్నకారు రైతు ఏటీఎం మోడల్ వేసుకోవడం వల్ల అధిక దిగుబడి పొందవచ్చన్నారు. అలాగే హుమయూన్ బాషా బీడుభూమిలో డ్రాట్ ప్రూఫింగ్ మోడల్ చేపట్టినట్లు వివరించారు. ఈ మోడల్ వల్ల బీడు భూమిని సాగు భూమిగా మార్చుకోవచ్చన్నారు. ఎస్ఎఫ్ఎంటీ సుధాకర్, మోడల్ మేకర్ రంగస్వామి, మెంటర్ హుమయూన్‌బాషా, ఎల్-1 హుసేన్, ఐసీఆర్‌పీ ఎస్ ఫార్మర్, సైంటిస్టులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న డీపీఎం చంద్రశేఖర్, సిబ్బంది

ఆశాజనకంగా సజ్జ పంట

కృష్ణగిరి: ఈ యేడాది ఖరీఫ్‌లో మొదటి పంటగా సాగుచేసిన సజ్జ మరో 10 రోజుల్లో అన్నదాత చేతికి రానుంది. ఎలాంటి మందులు వాడకుండా పండించే పంటగా గుర్తింపు ఉన్న సజ్జ ఈ యేడాది అన్నదారులకు సిరులు కురిపించనుంది. జూన్‌లో కురిసిన వర్షాలకు ప్రత్యామ్నాయ పంటగా సాగు చేసిన సజ్జ కంకులు విరగ్గాయడంతో అన్నదాతలు అనందంగా ఉన్నారు. ప్రతేడాది వేరుశనగ, అముదంతో నష్టాలు మూటగట్టుకున్న కొందరు రైతులు ఈసారి పంట మార్పిడితో పాటు ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గు చూపారు. విత్తనం కొనుగోలు తప్పా ఎలాంటి పెట్టుబడులు లేకుండా పంట చేతికి వస్తుండటంతో సజ్జ రైతులు ధీమాగా ఉన్నారు. సజ్జ, కొర్రకు ఏలాంటి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడాల్సిన అవసరం లేకపోవడంతో వీటిని తినడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఏటా నష్టాలు వస్తుండటంతో రైతులు కంది, వేరుశనగలో ప్రత్యామ్నాయ పంటగా సజ్జ సాగుచేయడంతో పాటు సజ్జ తర్వాత మరో రెండు మూడు వర్షాలు వస్తే కంది కూడా మంచి దిగుబడి వస్తుందని దీన్ని ప్రతి రైతు పాటించినప్పుడే కరువు నుంచి గట్టెక్కవచ్చని వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు అంటున్నారు. ఈయేడాది ఖరీఫ్‌లో సజ్జ సాగు దాదాపుగా 320 ఎకరాల్లో రైతులు సాగు చేశారని పంటలు ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొన్నారు. గత నెలన్నర రోజులుగా బెట్ట ఏర్పడినా గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో సజ్జ ఏపుగా పెరిగి కంకి బాగా వచ్చింది.



కోయిలకొండ సమీపంలో సాగుచేసిన సజ్జ పంట

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

హొళగుంద: మండల కేంద్రంతో పాటు పల్లెల్లో ప్రజలు శ్రీకృష్ణాష్టమి వేడకలను ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రావణ బహుళ అష్టమిని పురస్కరించుకుని ఇళ్లల్లో కృష్ణుడి విగ్రహాన్ని ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఇళ్ల ముందు కృష్ణుడి పాదాల ముగ్గులు వేసి తమ పిల్లలతో నడిపించి తన్మయం పొందారు. కృష్ణ, రాధ, కామధేను, గోపి, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. తల్లిదండ్రులు పిల్లలతో వేణునాదం ఊదడం, గోపికల వేషాలు, ఉట్టి కొట్టడం, ఇతర భంగిమలలో సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసి సంబర పడ్డారు.

కృష్ణగిరి: కోయిలకొండ గ్రామంలో ప్రబోదానంద స్వామి సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆరడుగుల కృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అఖండ భజన కార్యక్రమం చేపట్టారు. శ్రీకృష్ణుడి జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరయ్య, గోవిందరాజులు, సంజీవుడు తదితరులు బహుమతులు అందజేశారు. శనివారం శ్రీకృష్ణుడి విగ్రహ ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు వెల్లడించారు.

తుగ్గలి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ప్రబోధానంద సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం తుగ్గలి, జొన్నగిరి, రామలింగాయపల్లిలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక మండపాల్లో ప్రతిష్ఠించిన చిన్ని కృష్ణుల విగ్రహాలకు భక్తులు, నిర్వాహకులు పూజలు చేశారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, కుంకుమ, చందనం, పంచామృతంతో అభిషేకాలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తుగ్గలిలో మేళ తాళాలతో శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు నిర్వహించారు.

మద్దికెర: మండలంలోని పెరవలి గ్రామంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకొని జమ్మాను కట్ట వద్ద స్వామివారి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. భగవద్గీత శ్లోకాలను చదివి వినిపించారు. అనంతరం స్వామి వారి చిత్ర పటాన్ని గ్రామ పురవీధుల గుండా మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో బాణాసంచా పేల్చుతూఊరేగింపు వైభవంగా నిర్వహించారు.

వెల్దుర్తి: పుల్లగుమ్మి కృష్ణాలయంలో బుధవారం రాత్రి చిన్ని కృష్ణుడికి ఉయ్యాల (తొట్టి) సేవ నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలనంతరం, ఉత్సవ మూర్తిని సుందరంగా అలంకరించబడిన ఊయలలో ఉంచారు. ఆలయ కమిటీ, గ్రామ యాదవుల ఆధ్వర్యంలో ఊయలూపుతూ జరిగిన వేడుకలో గ్రామ భజన బృందం తమ గానంతో జోలాలి పాడారు.



శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద బహుమతులు పొందిన విద్యార్థులు



తుగ్గలిలో కృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న ప్రబోధానంద సేవా సమితి సభ్యులు

ఆదర్శవంతంగా పనిచేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఉపాధ్యాయులు నిబద్ధత తో పనిచేసి విద్యాభివృద్ధికి తమ వంతుగా కృషి చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నరాజు సూచించారు. ఉపాధ్యాయ దినోత్స వం సందర్భంగా బుధవారం స్థానికంగా ఏర్పా టు చేసిన కార్యక్రమంలో ఇటీవల పదోన్నతు లు పొందిన 60 మంది ఉపాధ్యాయిని, ఉపా ధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను ఎస్టీ యూ నాయకులు సత్కరించి మాట్లాడారు. పదోన్నతి పొందిన వారు బాధ్యతాయుతంగా పని చేసి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఎస్టీయూ నాయకు లు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సత్కరించిన దృశ్యం